# డీప్ ఫేక్‌తో 200 కోట్ల దోపిడీ

- ఏకంగా సీఎఫ్‌వోను క్లోన్ చేసి.. ఫేక్ జూమ్ మీటింగ్
- డబ్బులు కాజేసిన కేటుగాళ్లు
- హాంకాంగ్‌లో ఘరానా మోసం



న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారిన డీప్‌ఫేక్ టెక్నాలజీకి సెలబ్రిటీలు, వీఐపీలే కాదు.. ఏకంగా కంపెనీలు కూడా బోల్తా పడుతున్నాయి. తాజాగా హాంకాంగ్‌కు చెందిన ఓ మల్టీ నేషనల్ కంపెనీని ఈ డీప్‌ఫేక్ టెక్నాలజీతో దుండగులు బురిడీ కొట్టించారు. ఏకంగా రూ.200 కోట్ల (25.6 మిలియన్ డాలర్లు) సొమ్మును స్మార్ట్‌గా కొట్టేశారు. ఇందుకోసం కంపెనీ సీఎఫ్‌వోను డీప్‌ఫేక్ టెక్నాలజీతో క్లోన్ చేశారు. ఆ కంపెనీ ఉద్యోగుల గొంతులు, రూపాలకు నకిలీలు సృష్టించారు. వీరంతా కలిసి కంపెనీలోని అకౌంటెంట్ ఉద్యోగితో జూమ్ మీటింగ్‌లో వారంపాటు పలు దఫాలుగా సమావేశమవుతూ హాంకాంగ్‌లోని 6 బ్యాంకు అకౌంట్లకు దాదాపు రూ.200 కోట్లు జమ చేయించారు. అనుమానం వచ్చిన ఆ ఉద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మోసం బయటపడింది. ఇప్పటివరకు నేరస్తులు ఎవరినీ అరెస్టు చేయలేదు అని పోలీసులు తెలిపారు.

## శ్రీకృష్ణ జన్మభూమిలో ఆలయాన్ని కూల్చిన ఔరంగజేబు!

- ఆ స్థానంలో మసీదు నిర్మాణం
- 1920 నాటి రికార్డుల్లో వెల్లడి
- ఆర్టీఐ కింద ఏఎస్ఐ సమాధానం
- షాహీ ఈద్గా కేసులో సాక్ష్యంగా చూపెడుతామన్న లాయర్

మథుర, ఫిబ్రవరి 6: మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి కాంప్లెక్స్‌లో ఒక ఆలయాన్ని మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ధ్వంసం చేసి, దానిపై మసీదు నిర్మించాడని 1920 నాటి బ్రిటిష్ ప్రభుత్వ గెజిట్ రికార్డులు చెబుతున్నాయని ఆగ్రా పురావస్తు శాఖ ఒక ఆర్టీఐ సమాధానంలో వెల్లడించింది. అయితే ఏఎస్ఐ తన సమాధానంలో 'శ్రీకృష్ణ జన్మభూమి' అనే పదాన్ని ప్రత్యేకంగా పేర్కొనలేదు. అంతకుముందు ఉన్న కేశవ్‌దేవ్ ఆలయాన్ని ఔరంగజేబు కూల్చి మసీదు నిర్మించాడని మాత్రమే ఏఎస్ఐ పత్రాలు పేర్కొన్నాయి. ఈ మేరకు కేశవ్‌దేవ్ ఆలయం కూల్చివేతకు సంబంధించిన వివరాలు కోరుతూ మొయిన్‌పురికి చెందిన అజయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద చేసిన దరఖాస్తుకు ఏఎస్ఐ ఇచ్చిన సమాధానం తాజాగా సంచలనంగా మారింది.ఈ ఆధారాన్ని సుప్రీంకోర్టు, అలహాబాద్ హైకోర్టుల్లో సాక్ష్యంగా చూపెడతామని శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా వివాదం కేసులో హిందువుల తరపున వాదిస్తున్న న్యాయవాది సింగ్ తెలిపారు. ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు ఈ నెల 22కు షెడ్యూల్ చేసింది.

## హైనాల నుంచి భర్తను కాపాడిన భార్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: హైనాల మధ్య చిక్కుకుని ప్రాణభయంతో ఆర్తనాదాలు చేస్తున్న భర్తను ప్రాణాలకు తెగించి కాపాడింది భార్య. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటు చేసుకుంది. కొండగావ్ జిల్లాలో నివసించే నందు యాదవ్ సోమవారం నీళ్లు పెట్టడానికి పొలం వద్దకు వెళ్లగా, అతడిని కొన్ని హైనాలు చుట్టుముట్టి దాడి చేశాయి. దీంతో అతను భయంతో కేకలు పెట్టాడు. అతడి అరుపులు విని సమీపంలో ఉన్న అతని భార్య సుగ్ని పరుగెత్తుకుంటూ వచ్చి గట్టిగా అరుస్తూ వాటిని తరిమివేయడానికి ప్రయత్నించింది. అయినా అవి బెదరక దాడిని కొనసాగించాయి. అదృష్టవశాత్తు ఆమెకు అక్కడ పొలంలో ఒక కర్ర దొరికింది. దీంతో ఆ కర్రతో ఒక హైనాను ఆపకుండా తలపై కొట్టడంతో అది చచ్చిపోయింది. దీంతో మిగిలిన హైనాలు భయంతో పారిపోయాయి. చేతులు, కాళ్లు, పొట్టపై గాయాలైన నందు యాదవ్‌ను దవాఖానకు తరలించగా, ప్రాణాపాయమేమీ లేదని డాక్టర్లు చెప్పారు.

# అమెరికాలో తుఫాన్ బీభత్సం

### కాలిఫోర్నియాలో భారీ వర్షం, హిమపాతం

### ముగ్గురు మృతి.. పలుచోట్ల అత్యవసర పరిస్థితి

లాస్‌ఏంజెల్స్, ఫిబ్రవరి 6: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో తుఫాన్ బీభత్సం సృష్టించింది. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడమే కాక పలు చోట్ల భారీ హిమపాతం కురిసింది. దీంతో లాస్ ఏంజెల్స్ సహా పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఆకస్మిక వరదలు సంభవించాయి. మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. సోమవారం దక్షిణ కాలిఫోర్నియాలోని కోస్తా, లోయ ప్రాంతాల్లో సుమారు 20 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, రానున్న రెండు రోజుల్లో పర్వత ప్రాంతాల్లో 35 సెం.మీ వర్షపాతం కురవొచ్చునని హెచ్చరికలు జారీ అయ్యాయి. తుఫాన్ కారణంగా ఉత్తర కాలిఫోర్నియాలో ముగ్గురు మృతి చెందారు. అలాగే వరద నీటిలో కొట్టుకుపోతున్న పలువురిని సహాయ బృందాలు రక్షించాయి. భారీ హిమపాతం కారణంగా ఎక్కడబడితే అక్కడ పెద్దయెత్తన మంచు పేరుకుపోయింది. సియారా నెవెడాలో భారీగా మంచు కురియడంతో మౌంటెన్ రోడ్లపై ప్రయాణించవద్దని ఆదేశాలు జారీ అయ్యాయి. పలుచోట్ల అత్యవసర పరిస్థితిని విధించారు. దక్షిణాన ఉన్న పర్వత ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. తుఫాన్ కారణంగా పలువురు నిరాశ్రయులయ్యారు. సోమవారం సాయంత్రం నుంచి 7,10,00 మంది విద్యుత్తు లేక అంధకారంలో మగ్గుతున్నారు.



లాస్‌ఏంజెల్స్‌లో తుఫాన్ ధాటికి బురదలో కూరుకుపోయిన కార్లు

# కార్యకర్తలు కుక్కలా?!

- కుక్క వదిలేసిన బిస్కెట్‌ను వాళ్లకు ఇస్తారా?
- కాంగ్రెస్ నేత రాహుల్‌పై బీజేపీ మండిపాటు
- కుక్క బిస్కెట్లు నచ్చకనే కాంగ్రెస్‌ను విడిచిపెట్టా
- అస్సాం సీఎం హిమంత ట్వీట్
- బిస్కెట్ కుక్క యజమానికే ఇచ్చా.. రాహుల్ వివరణ



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరో వివాదంలో చిక్కుకొన్నారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా జార్ఖండ్‌లో ఆదివారం ఓ సభలో రాహుల్ ఓ కార్యకర్త చేతికి కుక్క తినే బిస్కెట్ ఇచ్చారు. తొలుత కుక్కకు బిస్కెట్‌ను ఆఫర్ చేసిన రాహుల్.. అది తినడానికి నిరాకరించడంతో పక్కనే ఉన్న ఓ వ్యక్తికి ఆ బిస్కెట్‌ను ఇచ్చారు. ఈ వీడియోను బీజేపీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ రాహుల్ వైఖరిపై మండిపడ్డారు. బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ ఈ వీడియోను షేర్ చేస్తూ.. రాహుల్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ బూత్ ఏజెంట్లను కుక్కలతో పోల్చారు. ఇప్పుడు రాహుల్ కుక్క తినే బిస్కెట్లను కార్యకర్తలకు ఇస్తున్నారు. కార్యకర్తలంటే కుక్కలా? కార్యకర్తలను కుక్కలుగా చూసే అధ్యక్షుడు, యువరాజు ఉన్నందుకు ఆ పార్టీ కనుమరుగవ్వడం సహజమే' అని ఎద్దేవా చేశారు. ఈ వీడియోపై అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ కూడా స్పందించారు. 'రాహుల్ గాంధీ మాత్రమే కాదు. ఆయన కుటుంబం మొత్తం కలిసినా నన్ను ఆ బిస్కెట్‌ను తినేలా చేయలేకపోయారు. నేను ఆత్మాభిమానం ఉన్న అస్సామీని, భారతీయుడిని. అందుకే రాహుల్ పెంపుడు కుక్కతినే ప్లేటులో బిస్కెట్లను నాకు ఆఫర్ చేస్తే నిరాకరించా. కాంగ్రెస్‌కు రాజీనామా చేశా' అంటూ గతంలో జరిగిన ఘటనను ఉటంకిస్తూ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.

**తప్పేముంది: రాహుల్**

వివాదం ముదురుతుండటంతో ఈ ఘటనపై రాహుల్ స్పందించారు. వీడియోలో తాను మాట్లాడిన కార్యకర్తదే ఆ కుక్కపిల్ల అని పేర్కొన్నారు. బిస్కెట్ తినేందుకు కుక్క నిరాకరించడంతో దాని యజమానికి బిస్కెట్ ఇచ్చానని, ఇందులో తప్పేముందని ఎదురు ప్రశ్నించారు.

# ఇంటి కిరాయి భరించలేం

- ఆదాయంలో 30% పైగా అద్దెకే
- అమెరికాలో సగం కిరాయిదారులు గగ్గోలు
- హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): అమెరికాలో ఏటా పెరుగుతున్న ఇంటి అద్దెలు కోట్లాది కుటుంబాలకు భారంగా మారాయి. ఇంటి కిరాయి భరించలేని కుటుంబాల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని, దేశంలో గూడు లేని వారి సంఖ్య కూడా రికార్డు స్థాయికి చేరిందని హార్వర్డ్ యూనివర్సిటీ జాయింట్ సెంటర్ ఫర్ హౌసింగ్ స్టడీస్ తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. కుటుంబ ఆదాయంలో 30 శాతం లేదా అంతకన్నా ఎక్కువ ఇంటి కిరాయి కోసం ఖర్చు చేస్తున్న కుటుంబాల సంఖ్య 2.2 కోట్లు ఉంటుందని ఓ అంచనా. ఇందులో సగం (సమారుగా 1.1 కోట్ల కుటుంబాలు) తమ ఆదాయంలో 50శాతానికిపైగా ఇంటి కిరాయి కింద చెల్లిస్తున్నారని సమాచారం. కొవిడ్ ముందునాటితో పోల్చితే అమెరికా అంతటా ఇంటి అద్దెలు అనూహ్యంగా పెరగటం అక్కడి కోట్లాది కుటుంబాల్ని ఆందోళనకు గురిచేస్తున్నది. దీనివల్ల ఇతర అవసరాల్ని ఆ కుటుంబాలు తీర్చుకోలేక పోతున్నాయని నివేదిక తెలిపింది. 'తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతున్నది. గత కొన్నేండ్లుగా వారి ఆదాయంలో పెద్దగా మార్పు లేదు' అని సీనియర్ రిసెర్చ్ అసోసియేట్ వింట్నే ఒబ్రియిస్కీ చెప్పారు. కొత్త అపార్ట్‌మెంట్స్ నిర్మాణం జరుపుకుంటున్నా, డిమాండ్ తగ్గ సరఫరా లేదని 'రియల్టర్స్.కామ్' పేర్కొన్నది.

## యూకే వీసాలు మరింత భారం

**ఫీజులు భారీగా పెంపు • ఈ నెల 6 నుంచే అమల్లోకి**

లండన్ : యూకే వీసా ఫీజులు పెంచుతూ సునాక్ సర్కారు నిర్ణయం తీసుకొన్నది. ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్‌చార్జీలు పెరిగిన నేపథ్యంలో వీసా ఫీజు ఏడాదికి రూ.51,828 (624డాలర్లు) నుంచి 85,964 (1,035) డాలర్లకు పెంచింది. 18 ఏండ్లలోపు స్టూడెంట్స్‌కు వీసా ఫీజు ఏడాదికి 39,037 (470 డాలర్లు) నుంచి రూ. 64,452 (776 డాలర్లు)కు పెంచుతున్నట్టు వెల్లడించింది. యూకేలో ప్రవేశం లేదా నివాసం కోసం దరఖాస్తు చేసుకొనేటప్పుడు ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్‌చార్జీలు తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ పెంచిన వీసా ఫీజులను ఈ ఏడాది జనవరి 16 నుంచి అమలు చేయాలని అనుకున్నప్పటికీ పార్లమెంట్ వాయిదాలతో ఫిబ్రవరి 6కు మార్చారు.



## అమ్మ జోక్‌తో ఐదేండ్ల కోమా నుంచి బయటకు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: వైద్య చరిత్రలో ఇదో మిరాకిల్.. అసాధ్యం అనుకున్నవి సాధ్యమైనప్పుడు వైద్యులు వాడే పదాలివి. సరిగ్గా ఇలాంటి అద్భుతమే జరిగింది అమెరికాలో. రోడ్డు ప్రమాదంలో ఐదేండ్ల క్రితం కోమాలోకి వెళ్లిన ఓ మహిళ ఇటీవల తన తల్లి జోక్‌తో నవ్వింది. కోమా నుంచి బయటకు వచ్చింది. క్రమంగా కోలుకుంటున్నది. అమెరికాలోని మిషిగాన్‌కు చెందిన ఫ్లెవెల్లెన్ జెన్నిఫర్ 2017 సెప్టెంబర్‌లో జరిగిన ఓ కారు ప్రమాదంతో కోమాలోకి వెళ్లింది. నాటి నుంచి ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. 41 ఏండ్ల జన్నిఫర్ మెదడు నిద్రాణా వ్యవస్థలోకి వెళ్లిపోయింది. కొద్ది రోజుల క్రితం తన తల్లి పెగ్గి మీన్స్ చెప్పిన జోక్‌కు నవ్వుతూ కోమా నుంచి బయటపడింది. జెన్నిఫర్ ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నది. తన కుమారుడి పుట్‌మ్యాచ్‌లు కూడా చూస్తున్నది. 1-2 శాతం పేషెంట్లు సుదీర్ఘ కోమా నుంచి బయటపడి పూర్తిగా కోలుకొనే అవకాశాలు ఉన్నట్టు వైద్య నిపుణులు తెలిపారు.

## భారత పర్యాటకులకు వీసా-ఫ్రీ ఎంట్రీ: ఇరాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భారత పర్యాటకులకు ఇరాన్ శుభవార్త చెప్పింది. వారు తమ దేశంలో పర్యటించడానికి వీసా కలిగి ఉండాలన్న నిబంధనను ఈ నెల 4 నుంచి కొన్ని షరతులతో ఎత్తి వేస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. సాంస్కృతిక, పర్యాటక సంబంధాల మార్పిడిని మరింత వేగవంతం చేసుకొనేందుకు ఈ నూతన విధానం అమలు చేస్తున్నట్టు తెలిపింది. ఈ ప్రకటనలో తెలిపిన నిబంధన ప్రకారం సాధారణ పాస్‌పోర్ట్ కలిగిన భారతీయులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వీసా లేకుండా ఇరాన్‌లో గరిష్ఠంగా 15 రోజులు ఉండవచ్చు. అయితే ఈ కాల పరిమితిని పొడిగించరు. కేవలం పర్యాటకం కోసం వచ్చినవారికి మాత్రమే వీసా ఎత్తివేత అమలవుతుంది.


